క్లుప్తంగా

ఒంటరితనం భరించలేక వ్యక్తి ఆత్మహత్య

ఎల్కతుర్తి : కుటుంబ కలహాలతో భార్యా, పిల్లలకు దూరంగా ఒంటరిగా ఉంటున్న వ్యక్తి జీవితంపై విరక్తిచెంది ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై గోదారి రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మసాగర్ మండలం దేవునూర్ గ్రామానికి చెందిన గాజుల కోటి(50) కుటుంబ కలహాలతో గత కొంత కాలంగా భార్య, పిల్లలకు దూరంగా ఉంటున్నాడు. మండల కేంద్రంలోని ఓ హోటల్లో పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. అయితే హోటల్ సరిగా నడవకపోవడంతో యజమాని మూసివేశాడు. దీంతో భార్య, పిల్లలకు దూరంగా ఉంటూ ఒంటరి జీవితాన్ని భరించలేక మనస్తాపంచెందిన కోటి.. ఆదివారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

మండల కమిటీల ఎన్నిక



ఐనవోలు : మాదిగ హక్కుల దండోరా(ఎంహెచ్‌డీ) ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గనిపాక ప్రదీప్ ఆధ్వర్యంలో ఐనవోలు మండల పురుషుల, స్త్రీల కమిటీలను సోమవారం ఎన్నుకున్నారు. పురుషుల మండల కమిటీ అధ్యక్షుడిగా కొత్తూరి రమేష్ జాన్సన్, ఉపాధ్యక్షుడిగా బరిగల ఇస్సా, ప్రధానకార్యదర్శిగా అరూరి మధు, కార్యదర్శిగా కంజర్ల మహేష్‌తో పాటు బి.మహేష్, టీ.ప్రశాంత్, సదానందం, బాబు, భిక్షపతి, దయాకర్, నాగరాజు, ముత్యాలు ఎన్నికయ్యారు. అలాగే మహిళా కమిటీ మండల అధ్యక్షురాలుగా తాటికాయల పూల, ప్రధానకార్యదర్శిగా లక్ష్మి, ఉపాధ్యక్షురాలుగా కళావతి, కార్యదర్శిగా రేణుక, సంయుక్త కార్యదర్శిగా లక్ష్మిను ఎన్నుకున్నట్లు ప్రదీప్ వెల్లడించారు. నూతన కార్యవర్గ సభ్యులకు నియామకపత్రాలు అందించారు. జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ రాజ్‌కుమార్, అశోక్, అరుణ్, కమలాకర్ పాల్గొన్నారు.

సీఐగా క్రాంతికుమార్



ఆత్మకూరు : సీఐగా వి.క్రాంతికుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతిఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. ఇదివరకు ఇక్కడ విధులు నిర్వర్తించిన సంతోష్ కమాండ్‌కంట్రోల్‌కు బదిలీకాగా కాంత్రికుమార్ ఎస్‌బీ నుంచి బదిలీపై వచ్చారు. సిబ్బంది ఆయకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

ఫర్టిలైజర్ షాపుల తనిఖీ




వేలేరు : మండలంలోని వివిధ గ్రామాల్లో గల ఫర్టిలైజర్ షాపులను ఏఓ ఎల్.పద్మ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు ఎమార్పీ ధరలకే ఎరువులు, పురుగు మందులు విక్రయించాలన్నారు. స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. ప్రతీరోజు స్టాక్, ధరల వివరాలు బోర్డుపై రాయాలని ఆదేశించారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ



వేలేరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు 1988–89 పదోతరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు పెన్నులు, పరీక్ష ప్యాడ్లు అందించారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి మంచి మార్కులు సాధించాలని కోరారు. చదువతోనే భవిష్యత్ ఉంటుందని, ఉపాధ్యాయులను గౌరవించాలని అన్నారు. తాము చదువుకున్న పాఠశాలలకు సాయం చేయడం సంతోషంగా ఉందన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థులు రమాదేవి, శోభ, సాజీదా ఫాతిమా, అమరేందర్ రెడ్డి, కల్యాణ్ పాల్గొన్నారు. పాఠశాల హెచ్‌ఎం రాజన్న, ఉపాధ్యాయులు ఉన్నారు.

మృతదేహానికి నివాళి



వేలేరు : మండలంలోని పీచర గ్రామానికి చెందిన బత్తిని వెంకన్న అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ జెడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. వెంకన్న మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జ్ మల్కిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి రూ.2 వేలు ఆర్థికసాయం అందించారు.

ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



కొత్తగట్టుసింగారంలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

శాయంపేట : ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలో రూ. 10లక్షల నిధులతో చేపట్టనున్న శివాలయ ప్రహరీ, కల్యాణ మండపం నిర్మాణానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండలానికి త్వరలో అంబులెన్స్ ఏర్పాటు చేస్తామని అన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పైపులైన్లు, మోటర్ల మరమ్మతు కోసం నిధుల కేటాయించామన్నారు. గాంధీనగర్‌లో గత ప్రభుత్వం హయాంలో బీఆర్ఎస్ నాయకులు 200 ఎకరాల భూమిని ఆక్రమించుకోగా దాన్ని స్వాధీనం చేసుకొని ఆ ప్రాంతంలో రూ. 25కోట్లతో మోడల్‌స్కూల్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాల్లో ఇప్పటికే నాలుగు పథకాలు అమలు చేశామన్నారు. భద్రాచలంలో శ్రీరాముని సన్నిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. నాయకులు, అధికారులు ఎవరైనా అవినీతికి పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. మాందారిపేట గుట్టల్లో కొందరు క్రషర్లు ఏర్పాటు చేసి ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారని, పేదల భూములను ఆక్రమించుకున్న దుండగులను వెంటాడి పేదలకు స్థలాలు ఇప్పిస్తానని స్పష్టం చేశారు. పార్టీలకతీతంగా ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మండలంలోని గోవిందాపూర్ శివారులోగల కేజీబీవీ గురుకుల పాఠశాలలో రూ. 13లక్షలతో చేపడుతున్న సివిల్‌వర్క్స్, విద్యుత్ పనులు, వాటర్ ప్లాంట్ ఏర్పాటు కోసం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు శంకుస్థాపన చేశారు. కొత్తగట్టుసింగారం, తహరాపూర్‌లో సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కేజీబీవీ వద్ద బస్సు నిలుపుదల చేయడంలేదని మహిళా ఉపాధ్యాయురాళ్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళగా.. భూపాలపల్లి, పరకాల డిపో మేనేజర్లతో ఫోన్‌లో మాట్లాడి రిక్వెస్ట్ బస్‌స్టాప్ ఏర్పాటు చేసి బస్సులను ఆపాలని ఆదేశించారు. అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారా అని విద్యార్థులను తెలుసుకున్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి మంచి మార్కులు సాధించాలని అన్నారు. ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పశువుల మేతపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న అగ్రికల్చర్ విద్యార్థులు

కమలాపూర్ : పశువులకు పోషకమైన ఆహారం, సులభతరంగా జీర్ణమయ్యే సైలేజ్ తయారీపై రైతులు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఆర్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ విద్యార్థులు సూచించారు. సోమవారం మండలంలోని భీంపల్లిలో పాడి రైతులకు పశువుల మేత తయారీ విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాడిరైతులు సాధారణంగా పశువుల మేతపైనే అధికంగా ఖర్చు చేస్తుంటారని అన్నారు. అది సంవత్సరం వరకు దొరకడం కష్టకావచ్చని లేదా భద్రపర్చడం కష్టతరం కావచ్చని, దీనికి ప్రత్యామ్నాయంగా సైలేజ్ తయారీ విధానం అన్నారు. మేతను నిల్వ చేసి అధిక పోషకాలను జోడించే ప్రక్రియనే సైలేజ్ అంటారని తెలిపారు. సైలేజ్ చాలా పోషకమైందని, దీని ద్వారా పశువులకు ఆహారం సులభంగా జీర్ణమవుతుందన్నారు. ఎండుగడ్డిని నిల్వ చేయడం కంటే సైలేజ్ నిల్వ చేయడం చాలా సులభమన్నారు. తక్కువ స్థలం అవసరముండే ఈ పద్ధతి ద్వారా అధిక పాల ఉత్పత్తితో పాటు పశువులు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. కరిగే చక్కెరలు / సీహెచ్‌ఓ అధికంగా ఉండే పంటలు ఎన్‌సైలింగ్‌కు అత్యంత అనుకూలమైందని తెలిపారు. ఉదాహరణకు మొక్కజొన్న, జొన్న, బజ్రా, సాగు చేసిన, సహజమైన గడ్డిని 3–3.5 శాతం మొలాసిస్‌తో కలపవచ్చన్నారు. మందపాటి కాండం ఉన్న పంటలు సైలేజ్ రూపంలో సంరక్షించబడతాయన్నారు. పశుగ్రాసం 65 నుంచి 75 శాతం తేమ, తగినంత చక్కెరను కలిగి ఉన్నప్పుడు వాయురహిత లాక్టిక్ యాసిడ్ బ్యాక్టీరియా అధిక నాణ్యత (పీహెచ్ –2) శుభ్రమైన సువాసన కలిగిన సైలేజ్‌ను ఉత్పత్తి చేయడానికి అనుకూలంగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ విద్యార్థులు శ్రీవిద్య, శ్రుతి, లిఖిత, మనీషా, అక్షయ, శ్రీకావ్య, వందన, సుష్మ, శివాని, నాయకుడు కుమారస్వామి పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన



దుగ్గొండి : మండలంలోని మందపల్లి గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్వయంపాలన దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తరగతులు బోధించారు. ప్రధానోపాధ్యాయులుగా ఏసిక సాత్విక, ఉపాధ్యాయులుగా ఆకాశ్, సంజన, అక్షిత్, ఆశ్లేష, వర్షిత్, శ్రీరామ్ వ్యవహరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కర్ణకంటి రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

యువత ఆర్థిక ప్రగతి సాధించాలి



రాయపర్తి : యువత సన్మార్గంలో పయనిస్తూ ఉపాధి అవకాశాలు పొందుతూ ఆర్థిక ప్రగతి సాధించాలని పీఏసీఎస్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలో జేఎస్.యాకూబ్‌పాషా పేరుతో ఏర్పాటు చేసిన ఆటోమొబైల్ షాప్‌ను సోమవారం సుధీర్ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మజీద్–ఏ–నూర్ సదర్ హుస్సేన్, పోగులకొండ వేణు, సలీం, షకీల్, అక్బర్ పాల్గొన్నారు.

నివాళి

చెన్నారావుపేట : మండలంలోని ఖాదర్‌పేటకు చెందిన పెండ్లి రవి సోమవారం గుండెపోటుతో మృతి చెందగా ఆయన మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ బానోతు పత్తి నాయక్, బాల్నె వెంకన్న, బుర్రి తిరుపతి, సొసైటీ చైర్మన్ మురహరి రవి, కుమారస్వామి నాయకులు ఉన్నారు.

స్నాక్స్ అందజేత

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని ముత్తోజిపేటలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు రాబిన్‌హుడ్ ఆర్మీ వాలంటీర్లు సోమవారం హార్లిక్స్, పాలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాలంటీర్ నితీశ్ మాట్లాడారు. విద్యార్థులకు బ్యాగ్‌లు, సైకిళ్లు, ఇతర పరికరాలు అందించేందుకు తాము సిద్ధంగా ఉంటామన్నారు. నాయకులు రాజు, నవీన్ పాల్గొన్నారు.

ఆలయ భూకబ్జాపై కలెక్టర్‌కు ఫిర్యాదు

సంగెం : మండలంలోని మొంద్రాయి గ్రామంలోగల రాజరాజేశ్వరస్వామి ఆలయ భూమిని కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆలయ కమిటీ అధ్యక్షుడు చెవ్వ మొగిలి ఆధ్వర్యంలో గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సమస్యను కలెక్టర్‌కు వివరించారు. గ్రామానికి చెందిన వీరగోని రమేశ్ దంపతులు ఆలయ భూమిని కబ్జా చేయడంతోపాటు చారిత్రక కట్టడాలను నేలకూల్చేందుకు యత్నిస్తున్నారని తెలిపారు. ఆలయ భూమిని కాపాడాలని, కబ్జాదారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు కడ్దూరి సంపత్, వర్కింగ్ ప్రసిడెంట్ కక్కెర్ల వీరస్వామి, ప్రధానకార్యదర్శి పెండ్లి పురుషోత్తంరెడ్డి, గూడ విజయ్, పెండ్లి రమేశ్, పొన్నాల హరీశ్, తదితరులు ఫిర్యాదు చేసినవారిలో ఉన్నారు.



సంగెం : ఫిర్యాదు చేస్తున్న మొగిలి, గ్రామస్తులు

భూ ఆక్రమణపై దళితుల ఫిర్యాదు..

పర్వతగిరి : మండలంలోని దౌలత్‌నగర్‌కు చెందిన సుమారు 40 మంది దళితులు తమకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందించిన 40 ఎకరాల భూమిని కౌలు పేరుతో మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస్‌రావు ఆక్రమించాడని ఆరోపిస్తూ ఫిర్యాదు చేశారు. భూమి తమకు ఇప్పించాలని కోరారు.

డిగ్రీ కళాశాల విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

నర్సంపేట : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా మహిళా, శిశు సంక్షేమ కార్యాలయంలో నిర్వహించిన వివిధ పోటీల్లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ మల్లం నవీన్ తెలిపారు. సదరు విద్యార్థినులను కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ నవీన్, మహిళా సాధికారత సెల్ కన్వీనర్ డాక్టర్ సుమతి, సభ్యులు డాక్టర్ ప్రసూన, శైలజ కళాశాలలో సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నవీన్ మాట్లాడారు. పోస్టర్ ప్రజెంటేషన్‌లో బీఏ మొదటి సంవత్సర విద్యార్థిని హర్షిన్ మొదటి, బీఎస్సీ (బీజెడ్సీ) రెండో సంవత్సర విద్యార్థిని రెండో స్థానంలో శిరీష్మా నిలిచినట్లు తెలిపారు. వ్యాసరచన పోటీల్లో బీఎస్సీ (ఎంపీసీ) తృతీయ సంవత్సర విద్యార్థిని రచన మొదటి, బీఎస్సీ (బీజెడ్సీ) రెండో సంవత్సర విద్యార్థిని హర్షిత రెండో స్థానం సాధించినట్లు చెప్పారు. విద్యార్థినులు జిల్లా మహిళా, శిశు సంక్షేమ కార్యాలయ అధికారి శారద, డీఎంహెచ్‌ఓ వెంకటరమణ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారని తెలిపారు.

అర్హులందరికీ గృహజ్యోతి పథకం



నల్లబెల్లి : మాట్లాడుతున్న అశోక్



చెన్నారావుపేట : బిల్లు అందజేస్తున్న నాయకులు

నల్లబెల్లి : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు అర్హులందరికీ గృహజ్యోతి పథకాన్ని అమలు చేసి 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అందించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రసిడెంట్ వైనాల అశోక్ తెలిపారు. మండలంలోని నారక్కపేటలో పలువురికి ఆయన సోమవారం జీరో బిల్లు అందించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడారు. తెల్ల రేషన్ కార్డు కలిగి ప్రజాపాలనకు దరఖాస్తు చేసుకున్న కుటుంబాలకు గృహ జ్యోతి అమలు చేయనున్నట్లు తెలిపారు. ఏవైనా సమస్యలుంటే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో ప్రతీ ఇంటికి ఆరు గ్యారంటీ పథకాలను అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కొలిపాక పైడి, అత్తె నవీన్, పొగుల కుమారస్వామి, సూరబోయిన రాంబాబు, వడ్లూరి రమేశ్, కోడూరి రాయసాబ్, బొడిగె కృష్ణ, దండెం రాజేశ్, ఇట్టబోయిన కోటి, మహ్మద్ హుస్సేన్, ఉప్పుల రాజు, సాంబయ్య, రంజిత్, శ్రీపతి కుమారస్వామి, దిడ్డి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండలంలోని జల్లి గ్రామంలో పేదలకు కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బాదావత్ బాలు గృహ జ్యోతి పథకం కింద జీరో బిల్లు అందించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు అంబాల రవి, మంద శంకర్, ఇండ్ల సునీల్, వంగపండ్ల చిన్న రాజు, తదితరులు పాల్గొన్నారు.

మెపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా అశోక్

చెన్నారావుపేట : ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మండలంలోని లింగాపురం గ్రామానికి చెందిన నిమ్మనబోయిన అశోక్ ఎన్నికయ్యారు. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొట్టపల్లి సంజీవన్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో మీడియాతో అశోక్ మాట్లాడారు. తన ఎన్నికకు సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికవడం సంతోసంగా ఉందన్నారు.

రంజాన్‌ను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలి



రామన్నపేట: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మత సామరస్యతను ఇనుమడింపచేసేలా భక్తిశ్రద్ధలతో పండుగను నిర్వహించుకోవాలని వరంగల్ ఏసీపీ నందిరామ్‌నాయక్ సూచించారు. మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో ముస్లిం, హిందూ, క్రైస్తవ మతపెద్దలతో పీస్ కమిటీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. సామూహిత ప్రార్థనల దృష్ట్యా సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 7గంటలకు వరకు మండిబజార్ దారిలో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని చెప్పారు. సమావేశంలో మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి, మిల్స్ కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య, మత పెద్దలు పాల్గొన్నారు.

ప్రజాపాలన సేవాకేంద్రానికి జనం బారులు



సద్దిబువ్వ తింటున్న వృద్ధురాలు



దరఖాస్తులు ఇచ్చేందుకు ఎగబడుతున్న జనం

- సద్దిబువ్వ వెంటతెచ్చుకున్న వృద్ధులు

శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 6 గ్యారంటీ పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఏర్పాటు చేసిన సేవాకేంద్రానికి లబ్ధిదారులు బారులుదీరారు. 200 యూనిట్ల ఉచిత కరెంటు, రూ. 500కే గ్యాస్ సిలిండర్‌కు పొందేందుకు ఇటీవల నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో లబ్ధిదారులు దరఖాస్తుల్లో పూర్తి సమాచారం ఇవ్వకపోవడంతో వారికి పథకాలు వర్తించడంలేదు. దీంతో మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ప్రజాపాలనసేవా కేంద్రంలో దరఖాస్తులు సమర్పించేందుకు తరలివచ్చారు. అయితే మహిళలు తన వెంటతెచ్చుకున్న సద్దిబువ్వను కార్యాలయ ఆవరణంలో తింటూ కనిపించారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి బుద్ధిచెప్పాలి

- అంబేడ్కర్ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి ప్రకాశ్



మాట్లాడుతున్న ప్రకాశ్

ఎల్కతుర్తి : భారత రాజ్యాంగాన్ని మారుస్తామంటున్న బీజేపీకి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుతో బుద్ధిచెప్పాలని అంబేడ్కర్ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి చెప్యాల ప్రకాశ్ పిలుపునిచ్చారు. సోమవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి దళిత, బహుజనులపైన దాడులు, హత్యలు, మానభంగాలు పెరిగాయన్నారు. మోదీ ప్రభుత్వం మతపరమైన అల్లర్లు సృష్టిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తోందన్నారు. భారత రాజ్యాంగాన్ని మారుస్తామన్న బీజేపీ ప్రభుత్వానికి దళిత, బహుజనులు పూర్తిగా వ్యతిరేకించి రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటుతో బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. భారత రాజ్యాంగాన్ని మారుస్తామన్న నియంతపోకడను విరమించుకోవాలని, లేనిపక్షంలో బహుజనులంతా ఏకతాటిపైకి వచ్చి బీజేపీని పాతాళంలోకి తొక్కేస్తామని హెచ్చరించారు. కర్ణాటక సీనియర్ నేత, ఎంపీ అనంత హెగ్డే వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని, లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. మండల కన్వీనర్ రాజు, కోకన్వీనర్ రవీందర్, రాజ్‌కుమార్, రమేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

బూటకపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్

- మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి



ఆత్మకూరు : మాట్లాడుతున్న ధర్మారెడ్డి

ఆత్మకూరు : బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరిస్తుందని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలోని జీఎస్ఆర్ గార్డెన్స్‌లో సోమవారం జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చని ప్రతీ హామీని నెరవేర్చే విధంగా బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తోందన్నారు. ఆచరణకు సాధ్యంకాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ హామీలను మరిపించే ప్రయత్నం చేస్తుందన్నారు. బీఆర్ఎస్ శ్రేణులు సమస్యలపై ప్రశ్నిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కేసులు పెట్టి చిత్రహింసలు పెడుతుందని ఆరోపించారు. గ్రామాలు, పట్టణాల్లో నీటి కోసం ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని, పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక సీట్లు సాధించడమే లక్ష్యంగా ముందుకెళ్లాలని సూచించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ కేశవరెడ్డి, మాజీ సర్పంచ్‌లు యాదగిరి, నరేశ్, మనోహర్, లలిత, అన్నపూర్ణ, ఎంపీటీసీ రజనీకర్‌రెడ్డి, నాయకులు గణేశ్, అంకూస్, సుధాకర్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

దామెర : కాంగ్రెస్ పాలన అంటేనే కరువులు, కష్టాలు అని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి విమర్శించారు. ఒగ్లాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎన్నో అభివృద్ధి పనులు చేసుకున్నామని గుర్తుచేశారు. కొందరు వారి స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీ మారుతున్నారని అన్నారు. కార్తకర్యలు అధైర్య పడొద్దని, అండగా ఉంటానని అన్నారు. కాంగ్రెస్ 90రోజుల పాలనలోనే ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఆలేటి లింగమూర్తి తల్లి రామక్క అనారోగ్యంతో మృతి చెందగా ఆమె పార్థివదేహానికి ఎమ్మెల్యే నివాళులర్పించారు.

మోదీ మళ్లీ ప్రధాని అవడం ఖాయం

- బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ



మాట్లాడుతున్న రావు పద్మ

కమలాపూర్ : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్డీయే 400కుపైగా ఎంపీ సీట్లు గెలిచి మూడోసారి మళ్ళీ ప్రధానిగా నరేంద్రమోదీ ప్రమాణస్వీకారం చేస్తారని ఆ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ ధీమా వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌ను ఎంపీగా మరోసారి గెలిపించుకునే అవకాశం వచ్చిందన్నారు. ఈటల రాజేందర్ ఎక్కడి నుంచి పోటీ చేసినా తన స్వస్థలమైన కమలాపూర్‌కు ఎల్లప్పుడు అండగా ఉంటారన్నారు. బూత్‌స్థాయి కార్యకర్త నుంచి మొదలుకొని ప్రతి నాయకుడు సైనికుడిలా పనిచేయాలని కోరారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరిగే బీజేపీ బూత్ సంకల్ప్ సమ్మేళన సభకు మండలంలోని బూత్ అధ్యక్షులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అధికార ప్రతినిధి శోభన్‌బాబు, మండల ప్రధానకార్యదర్శులు ప్రవీణ్, శ్రీనివాస్, ఉపాధ్యక్షులు భిక్షపతి, సారంగపాణి, నాయకులు శ్రీనివాస్, సుధాకర్, కుమరస్వామి, సారయ్య, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు కోటేశ్వర్, మండల కార్యదర్శులు అరవింద్, సతీష్, ఎస్సీ మోర్చా అధ్యక్షులు ఇనుగాల రత్నాకర్, మహంకాళి రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



ధర్మసాగర్ : ఆరు గ్యారంటీ పథకాల్లో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ కార్యదర్శి రావుల వెంకట్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు టేకుమట్ల విష్ణు ఆధ్వర్యంలో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ పార్టీ మాట తప్పకుండా హామీలను అమలు చేస్తోందని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో ఒక్క ఇళ్లు కూడా కట్టలేదని విమర్శించారు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డి హయాంలో కట్టిన ఇళ్లలే నేటికి కనిపిస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రవీందర్, రాజు, అనిల్‌తో పాటు తదితరులు ఉన్నారు.